ఊరూరా ఉగాది వేడుకలు



గండేడ్ మండలం వెన్నాచేడ్‌లో ఉగాది పచ్చడి పంపిణీ

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- పొలం పనులకు శ్రీకారం చుట్టిన రైతులు
- శ్రీవిశ్వావసు నామ సంవత్సరం ప్రారంభం

సాక్షి, నెట్‌వర్క్: మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా ఊరూరా ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉగాదిని పురస్కరించుకొని కొత్త దుస్తులు ధరించి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. రైతులు వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. శ్రీవిశ్వావసునామ సంవత్సరంను పురస్కరించుకొని పంచాంగ శ్రవణంను వినేందుకు సాయంత్రం ఆలయాల వద్దకు భక్తులు తరలి వచ్చారు.

■ మహబూబ్‌నగర్‌లో ఉగాది సందర్భంగా హైందవులు వ్యాపార సంస్థల్లో, ఇళ్లల్లో, దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా కేంద్రం పిల్లలమర్రి రోడ్డులోని శ్రీవేంకటేశ్వరాలయం, టీడీ గుట్ట తిరుమలనాథుని ఆలయం, శ్రీనివాసకాలనీ పంచముఖాంజనేయస్వామి, టీచర్స్ కాలనీ రామాలయం, బ్రాహ్మణవాడిలోని వాసవీ మాత ఆలయం, పద్మావతి కాలనీ కాళికాలయం, వేంకటేశ్వర కాలనీ రాజరాజేశ్వరీమాత ఆలయంతోపాటు ఇతర ఆలయాల్లో దేవతామూర్తులకు విశేష అభిషేకాలు, అలంకరణ పూజలు చేశారు.

■ చిన్నచింతకుంట మండలంలోని కురుమూర్తి స్వామి, చిన్నవడ్డేమాన్ గ్రామ శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్న వడ్డేమాన్‌లో ఆకలి బువ్వ సేవా సమితి ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ చేశారు.

■ మిడ్జిల్‌లో పంచాంగ శ్రావణంను శ్రీనువాస మూర్తి వినిపించారు. ప్రజలు తమ రాశి ఫలాలు తెలుసుకొనేందుకు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకున్నారు.



జడ్చర్లలో పంచాంగ శ్రవణం చేస్తున్న కృష్ణానందగిరిస్వామి



మహబూబ్‌నగర్‌లో..

■ నవాబుపేటలో సంతకు వచ్చే జనాల కోసం ఇచ్చే ఉచిత భోజనంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహచారి ఉగాది పచ్చడి, బక్షాలు అందించి ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

■ గండేడ్ మండలంలోని వెన్నాచేడ్, గండేడ్, కొండారెడ్డిపల్లి, పగిడ్యాల్, రంగారెడ్డిపల్లి , రుసుంపల్లి, కప్లాపూర్, చిన్నవార్వాల్, పెద్దవార్వాల్ గ్రామాల్లో పచ్చడి పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వెన్నాచేడ్ వెన్నోని ఆంజనేయస్వామి దేవాలయం వద్ద సాయంత్రం శకటోత్సవం నిర్వహించారు.

■ దేవరకద్రలోని చెన్నకేశవస్వామి ఆలయం వద్ద వేదపండితులు పంచాంగ శ్రవణం వినిపించారు. వివిధ రాశులకు సంబంధించి బలబలాలు ఎలా ఉన్నాయో వివరించారు. అనంతరం గ్రామ పెద్దలు శివాలయం, చెన్నకేశవస్వామి దేవాలయం, ప్రసన్న ఆంజనేయస్వామి దేవాలయం, వీరప్పయ్యస్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూలు చేశారు.

■ మహమ్మదాబాద్ మండలంలోని మహమ్మదాబాద్, నంచర్ల, గాధిర్యాల్ గ్రామాల ఆలయాల్లో పల్లకీసేవ, ఎద్దులబండ్లు (శకటోత్సవం) నిర్వహించి పంచాంగ శ్రవణం వినిపించారు. గాధిర్యాల్ హనుమాన్ ఆలయంలో నాల్గు కోడెదూడలను వేలం వేయగా రూ.26వేలు వచ్చినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

■ జడ్చర్లలోని గంగాపురం లక్ష్మీచెన్నకేశవస్వామి, వేంకటేశ్వరస్వామి, వాసవీకన్యకాపరమేశ్వరి, పాత బజార్ హనుమాన్ దేవాలయాల వద్ద పంచాంగ శ్రవణంకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దేవునిగుట్ట తండా వద్ద ఉన్న శ్రీగిరిక్షేత్రం అష్టలక్ష్మి ఆలయం నిర్వాహకులు బ్రహ్మశ్రీ కృష్ణానందగిరిస్వామి మాట్లాడుతూ శివనామస్మరణ, శివాలయాల సందర్శనతో మేలు కలుగుతుందన్నారు.



దేవరకద్రలో..



మిడ్జిల్‌లో పూజల్లో పాల్గొన్న భక్తులు



నవాబుపేటలో..

శిశుగృహలో వేడుకలు

పాలమూరు: పట్టణంలోని శిశుగృహలో చిన్నారుల మధ్య ఉగాది వేడుకలను జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.పాపిరెడ్డి జరుపుకున్నారు. శిశుగృహలో ఉన్న చిన్నారులందరికీ నూతన దుస్తులు కొనుగోలు చేసి ఇవ్వాలని ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డి.ఇందిర, న్యాయవాది రవికుమార్‌యాదవ్ పాల్గొన్నారు.



శిశుగృహలో చిన్నారులతో న్యాయమూర్తి బి.పాపిరెడ్డి

క్లుప్తంగా

హైమాస్ట్ లైట్లు ప్రారంభం



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక పాత పాలమూరులో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ఆదివారం సాయంత్రం మున్సిపల్ మాజీ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కాలనీలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.

కలశాల ప్రతిష్ఠాపన, విగ్రహాల పునఃప్రతిష్ఠాపన



దేవరకద్ర: స్థానిక శివాలయం, వీరప్పయ్య స్వామి దేవాలయాల ప్రాంగణంలో కలశాల ప్రతిష్ఠాపన, విగ్రహాల పునః ప్రతిష్ఠాపనోత్సవాలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు హోమం చేశారు. కలశాల శోభాయాత్ర, యాగశాల ప్రవేశం, గోపూజ, గణపతి, గౌరిపూజ, శాంతి మంత్ర పారాయణం, కలశపూజ, నవగ్రహ అష్టదిక్పాలక, విగ్రహ జలాధివాసం కార్యక్రమాలను నిర్వహించారు.

నేడు కలశాల ప్రతిష్ఠాపన

శివాలయం, వీరప్పయ్యస్వామి దేవాలయాల్లో సోమవారం నూతన కలశాలను ప్రతిష్ఠించడంతో పాటు దేవత విశేష పూజ, మృత్యుంజయ హోమం, పీఠ సంస్కరం, బలిహారం, జయాధిహోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

తిరుమలనాథస్వామి ఆలయంలో పూజలు

కోయిల్‌కొండ: మండలంలోని చన్మన్‌పల్లి గ్రామంలోని తిరుమలనాథ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడు రోజులు వైభవంగా ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎస్‌డీఎఫ్ నిధుల ద్వారా ఏర్పాటుచేసిన మంచినీటి సౌకర్యంపై ఎమ్మెల్యే ఆరాతీశారు. ఆలయాభివృద్ధికి కావాల్సిన నిధులు కేటాయించేందుకు కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండ ల అధ్యక్షుడు జి.రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వై.విద్యాసాగర్‌గౌడ్, నాయకులు రవినాయక్, సత్యపాల్‌రెడ్డి, వెంకట్రాములు, థావుర్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

లో ఓల్టేజీ సమస్య రాకుండా చర్యలు



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఎండాకాలంలో పట్టణంలో లోఓల్టేజీ సమస్య రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు విద్యుత్‌శాఖ పట్టణ ఏడీ థావుర్యానాయక్ అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని విఘ్నేశ్వరకాలనీలో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ ప్రాంతంలో కొన్ని రోజులుగా తీవ్రమైన లోఓల్టేజీ సమస్య ఉండేదని అన్నారు. దీంతో విఘ్నేశ్వర కాలనీ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు సమస్యను తన దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించి ఆ ప్రాంతంలో 100కేవీ ట్రాన్స్‌ఫార్మను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తమ ప్రాంతంలో లోఓల్టేజీ సమస్యను పరిష్కరించినందుకు విద్యుత్‌శాఖ అధికారులకు కాలనీవాసులు ధన్యవాదాలు తెలిపారు. ఏఈ అరుణ్‌నాయక్, లైన్‌మెన్ విజయ్‌నాయక్, కాలనీ సొసైటీ అధ్యక్షుడు గోవర్ధన్, సభ్యులు శ్రీరాములు, భీమ్లానాయక్, లోక్యానాయక్, వెంకటేశ్, లక్ష్మణ్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఈదుల్ ఫితర్

- ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు
- ముగిసిన రంజాన్ ఉపవాసాలు
- శుభాకాంక్షలు తెలుపుకున్న ముస్లింలు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆదివారం రాత్రి షవ్వాల్ నెలవంక దర్శనమివ్వడంతో ముస్లింలు 29 రోజుల పాటు చేపట్టిన ఉపవాసాలను విరమించారు. చంద్రుడు కనిపించడంతో పరస్పరం ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా ఈద్గాలు, మసీదుల్లో ఈదుల్ ఫితర్ పండుగను జరుపుకొని సర్వ మానవ కళ్యాణం కోసం ప్రత్యేక నమాజుచేసి ప్రార్థనలు చేస్తారు. పేదలు, ధనికుల తేడా లేకుండా అందరూ నూతన వస్త్రాలను ధరించి ఆనందోత్సాహాలతో పండుగను జరుపుకుంటారు. జిల్లా కేంద్రంలోని జామీయ మసీదు నుంచి ఉదయం 8 గంటలకు ముస్లింలు సామూహికంగా గడియారం చౌరస్తా మీదుగా స్థానిక వానగట్టు రహెమానియా ఈద్గా వద్దకు చేరుకుంటారు. ఈద్గా వద్ద ఉదయం 9.30 గంటలకు జామియా మసీదు ప్రధాన ఇమామ్ హాఫిజ్ మహ్మద్ ఇస్మాయిల్ ప్రత్యేక నమాజు, ప్రార్థనలు చేయిస్తారు.

ఖౌమీ ఏకతా కమిటీ ఆధ్వర్యంలో శుభాకాంక్షలు

రంజాన్ ఈద్ ముబారక్ చెప్పడానికి ప్రజాప్రతినిధులు, అధికారులు ఈద్గా వద్దకు చేరుకొని పట్టణ ఖౌమీ ఏకతా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసే శిబిరం వద్ద ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలుపనున్నారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్‌తో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పండుగ వేడుకల్లో పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపనున్నారు.

కిటకిటలాడుతున్న వ్యాపార కేంద్రాలు

రంజాన్ మాసంలో జిల్లా కేంద్రంలోని వ్యాపార కేంద్రాలు కిటకిటలాడుతున్నాయి. ముస్లింలు పగలంతా ధాన్యంలో గడుపుతారని భావించిన వ్యాపారులు రోజూ రాత్రి పూట 12 గంటల వరకు షాపులను తెరచి ఉంచారు. మూడు రోజుల నుంచి క్లాక్‌టవర్, పాన్ చౌరస్తా, పాత గంజ్, అశోక్‌టాకీస్ చౌరస్తా, బస్టాండ్, న్యూటౌన్, మెట్టుగడ్డ, పద్మావతి కాలనీ ప్రాంతాల్లో ముస్లింలతో షాపులన్నీ కిటకిటలాడాయి. ముఖ్యంగా వస్త్రాలు, కాస్మోటిక్ వస్తువులు, మెహందీ, మిస్వాక్, ఇత్తర్ (సుగంధ ద్రవ్యాలు), సుర్మా, ధార్మిక పుస్తకాలైన ఖురాన్, జానీమాజ్‌లతో పాటు రంజాన్ మాసం ప్రత్యేక వంటకం షీర్‌కుర్మ తయారీ కోసం ఉపయోగించే సేమియాలు, డ్రైఫ్రూట్లను కొనుగోలు చేస్తున్నారు.



జిల్లా కేంద్రంలోని రహెమానియా ఈద్గా

ఈద్గా వద్ద ప్రత్యేక నమాజుకు ఏర్పాట్లు

ఈదుల్ ఫితర్ ప్రత్యేక నమాజుకు జిల్లా కేంద్రంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వేలాది సంఖ్యలో ముస్లింలు వక్ఫ్ రహెమానియా ఈద్గా వద్ద రానుండడంతో తగిన ఏర్పాట్లు చేశారు. టెంట్లు, తాగునీటి తదితర సౌకర్యాలు ఏర్పాట్లు చేశారు. కార్పొరేషన్ సిబ్బంది వారం రోజుల నుంచి ఈద్గా వద్ద మరమ్మతులు పనులు చేపట్టారు. ఈద్ నమాజ్ సందర్భంగా పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

జడ్చర్ల టౌన్: రంజాన్ ప్రత్యేక ప్రార్థనల కోసం మున్సిపాలిటీ పరిధిలోని ఈద్గాలు ముస్తాబయ్యాయి. పాతబజార్ పెద్దగుట్ట వద్ద ఉన్న ఈద్గాతోపాటు జడ్చర్ల ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని ఈద్గా, కావేరమ్మపేట మదర్సా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు.

ఘనంగా పద్మనాభస్వామి జాతర

నవాబుపేట: మండలంలోని తీగలపల్లిలో పద్మనాభస్వామి జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం గ్రామంలో ఉన్న వాహనాలను దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పంచాంగం వినిపించారు. మాజీ సర్పంచ్ జంగయ్య, నారాయణ , చెన్నయ్య, నారాయణగౌడ్ పాల్గొన్నారు.

క్రీడలతో యువతకు మేలు



మహమ్మదాబాద్: క్రీడలతో యువతకు మేలు చేకూరుతుందని మాజీ సర్పంచ్ వెంకట్రాంరెడ్డి తెలిపారు. మండలంలోని గాధిర్యాల్‌లో బాబుజగ్జీవన్‌రాం యూత్ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన యువకులకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్రీడల్లో రాణించే యువకులు ఎన్నో రకాలైన ఉద్యోగాలు కూడా పొందవచ్చని సూచించారు. అందుకు క్రీడల్లో యువకులు జిల్లా, రాష్ట్రస్థాయిల్లో రాణించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హన్మయ్య, వెంకటయ్య, గోపాల్, సురేష్, గోపాల్‌రెడ్డి, లక్ష్మికాంత్‌రెడ్డి, అంజిలయ్య, భీమయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు అన్నదానం



మహబూబ్‌నగర్ రూరల్: అన్నదానం మహాదానం అని మహబూబ్‌నగర్ అర్బన్ డిప్యూటీ తహసీల్దార్(డీటీ) దేవేందర్ కేసీరెడ్డి అన్నారు. తన కుమారుడు అక్షయ్‌కుమార్ కేసిరెడ్డి జ్ఞాపకార్థం ఆదివారం ఏనుగొండలోని రెడ్‌క్రాస్ అనాథాశ్రమంలో సుమారు 70మంది చిన్నారులకు అన్నదానం చేశారు. డీటీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్



కోయిల్‌కొండ: స్థానిక పెద్ద మసీద్‌లో ఆదివారం ముస్లింలకు ఇఫ్తార్ ఏర్పాటుచేశారు. నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కుంభం శివకుమార్‌రెడ్డి హాజరై ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పేట మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివరెడ్డి, మైనార్టీ నాయకులు గౌస్, ఆజెల్లీ, దస్తగిరి, షిరాజ్, మునుస్‌ఆలీ, హాసన్ పాల్గొన్నారు.

కౌకుంట్ల మండల కేంద్రంలో..

దేవరకద్ర: కౌకుంట్ల మండల కేంద్రంలోని జమీయా మసీద్ వద్ద ఆదివారం ముస్లింలకు ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు తుమ్మల శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ ఇచ్చారు. మాజీ ఎంపీటీసీ కిష్టన్న, బాబ్‌జానీ పాల్గొన్నారు.

వైభవంగా కర్రెప్పతాత రథోత్సవం



కృష్ణా: మండలంలోని ముడుమాల్ గ్రామంలో ఆదివారం కర్రెప్ప తాత ఉత్సవాలు ఘనంగా చేశారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం రథోత్సవం నిర్వహించారు. ఉత్సవాలకు వేలాది మంది భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

పేరూర్‌లో ఎద్దుల బండ్ల పోటీలు

దేవరకద్ర: కౌకుంట్ల మండలం పేరూర్ గ్రామంలో ఆదివారం ఎద్దుల బండ్ల పోటీలను నిర్వహించారు.గ్రామానికి చెందిన 25 బండ్లు పాల్గొన్నాయి. ప్రధాన వీధిలో జరిగిన పోటీలు రసవత్తరంగా సాగాయి. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని పోటీలను వీక్షించారు. పోటీలో గెలుపొందిన విజేతలకు టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్‌రెడ్డి బహుమతులను అందజేశారు.

చిన్నరాజమూర్‌లో..

మండలంలోని చిన్నరాజమూర్ ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ కోనరాజశేఖర్‌తో పాటు గ్రామస్తులు పెద్ద ఎత్తున పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవాలయంలో వేద పండితులు పంచాంగ శ్రవణం వినిపించారు.



ఎద్దుల బండ్ల పోటీలు ప్రారంభిస్తున్న టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్‌రెడ్డి

చలివేంద్రాలు ప్రారంభం

స్టేషన్ మహబూబ్‌నగర్: స్థానిక అశోక్‌టాకీస్ చౌరస్తాలోని అన్నదాన మండపం వద్ద ఆదివారం చలివేంద్రాన్ని అఖిల భారత అయ్యప్పదీక్ష ప్రచార సమితి జిల్లా అధ్యక్షుడు సీమ నరేందర్ ప్రారంభించారు. కార్యక్రమంలో కోశాధికారి సతీష్, కార్యనిర్వాహక కార్యదర్శి రామేశ్వర్, రఘురాంగౌడ్, శ్రీనివాసులు, రాంచంద్రయ్య పాల్గొన్నారు.

హమాలీ సంఘం సభ్యుల కోసం..

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ : క్లాక్‌టవర్ వద్ద హమాలీ సంఘం సభ్యుల కోసం నిర్మించిన విశ్రాంతి షెడ్, తెలంగాణచౌరస్తాలో శ్రీలక్ష్మీ స్పోర్ట్స్–మెన్స్ వేర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాలను, అలాగే సత్యమన్నకాలనీలో ఆర్‌ఓ ప్లాంట్‌ను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు.



భక్తిశ్రద్ధలతో షబే ఖదర్ వేడుకలు



మాట్లాడుతున్న రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్

స్టేషన్ మహబూబ్‌నగర్: పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా జిల్లా కేంద్రం సద్దల్‌గుండ్‌లోని అలీబా అబ్దుల్లా మసీద్‌లో శనివారం రాత్రి షబే ఖదర్ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మౌలానా గులాం మహమ్మద్ ధార్మిక సందేశం ఇచ్చారు. రంజాన్ నెలలోనే పవిత్ర గ్రంథం ఖురాన్ అవతరించిందన్నారు. ఖురాన్‌ను నిరంతరం పఠించాలని కోరారు. రంజాన్ స్ఫూర్తితో నిరుపేదలకు సేవలు చేయాలని కోరారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ పాల్గొని రంజాన్ మాసంలో పూర్తి ఖురాన్ పఠించిన హాఫీజ్‌సాబ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రహెమాన్ సోఫీ, హాజీ సలీ, మౌలానా ముబారక్, జహంగీర్‌బాబా, అబ్దుల్ ఖాదర్, జిలానీ, అలీబేగ్, మహ్మద్, నజీర్, రఫీ, రహీం, హాశం, నదీం, మోసిన్, తఖీ, అజహర్, ఫుర్‌ఖాన్, ఫసి, మజీద్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మహ్మద్ అవేజ్ అహ్మద్ పాల్గొన్నారు.

నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు



ఏదులాపూరంలో నిరుపయోగంగా ఉన్న క్రీడా ప్రాంగణం

- లోపించిన నిర్వహణ
- నిండిపోయిన ముళ్లపొదలు
- క్రీడాకారులకు దక్కని ప్రయోజనం
- బోర్డులు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్న అధికారులు

చిన్నచింతకుంట: క్రీడలను ప్రోత్సహిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో గత ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలు ఏర్పాటుచేసింది. ప్రస్తుతం ఈ క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి. గ్రామ పంచాయతీ సిబ్బంది వాటి నిర్వహణను పూర్తిగా మరిచిపోయింది. దీంతో క్రీడా ప్రాంగణాలు పేరుకు మాత్రమే పరిమితమయ్యాయి. మండలంలోని ఏ ఒక్క గ్రామంలో ఉపయోగంలో లేవు. దీంతో క్రీడా ప్రాంగణాల్లో పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలతో నిండి ఉన్నాయి. పలు చోట్ల పశువుల పాకగా మారాయి. ప్రతి రోజు గ్రామ పంచాయతీ సిబ్బంది విధుల్లో భాగంగా గ్రామాల్లో తిరుగుతున్నా వాటిని చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే..

గ్రామీణ ప్రాంతాలలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గత ప్రభుత్వం ఉపాధి హామీ చట్టం కింద ప్రతి గ్రామ పంచాయతీకి రెండున్నర లక్షల వ్యయాన్ని వెచ్చించి గ్రామీణ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటుచేసింది. అధికారులు క్రీడా ప్రాంగణాలకు బోర్డులు ఏర్పాటుచేసి చేతులు దులుపుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులకు క్రీడ స్థలాలు లేక గ్రామ సమీపంలోని పొలాల్లో పలు క్రీడలను ఆడుతున్నారు. ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలపై దృష్టిసారించి అందుబాటులోకి తేవాలని ఆయా గ్రామాల ప్రజలు, యువకులు కోరుతున్నారు.

అధికారులు దృష్టి సారించాలి



గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి. దీంతో వాటిలో పిచ్చి మొక్కలు పెరిగాయి. కొన్ని గ్రామాల్లో రైతులు పశువుల పాకగా మార్చారు. అధికారులు క్రీడా ప్రాంగణాలపై దృష్టి సారించి అందుబాటులోకి తీసుకురావాలి.

– పరమేశ్వర్‌గౌడ్, ఏదులాపూరం

అందుబాటులోకి తీసుకువస్తాం



గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం ఏర్పాటుచేసిన క్రీడా ప్రాంగణాల నిర్వహణ తీరుపై గ్రామ పంచాయతీ కార్యదర్శుల నుంచి నివేదిక తీసుకుంటాం. ఎక్కడ నిరుపయోగంగా ఉన్నాయో పర్యవేక్షిస్తాం. గ్రామస్తుల సహకారంతో అందుబాటులోకి తీసుకువస్తాం. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా ప్రాంగణాలను యువత సద్వినియోగం చేసుకోవాలి.

– సుధాకర్‌రెడ్డి, ఎంపీడీఓ, చిన్నచింతకుంట

పేదల సంక్షేమమే లక్ష్యం

- ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

చిన్నచింతకుంట/దేవరకద్ర/ అడ్డాకుల: పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని దమగ్నాపురం, దేవరకద్ర మండలం వెంకటాయపల్లికి చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు 41 మందికి మొదటి విడత చెక్కులను అందజేశారు. అడ్డాకుల మండల కేంద్రానికి చెందిన మునగాల రవి ప్రమాదవశాత్తు మృతిచెందడంతో ఆయన కుటుంబ సభ్యులకు ప్రమాదబీమా చెక్కును అందజేశారు. అనంతరం నెల్లికొండికి చెందిన విద్యార్థిని మౌనిక, కౌకుంట్ల మండలం ముచ్చింతల గ్రామానికి చెందిన విద్యార్థి నర్సింహారెడ్డికి తన సొంత నిధులతో ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని అన్నారు. విద్యార్థులు మంచిగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు.

చలివేంద్రం ప్రారంభం

భూత్పూర్: మండల కేంద్రంలోని చౌరస్తాలో, అమిస్తాపూర్‌లో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. వేసవికాలం దృష్ట్యా ప్రజలకు, ప్రయాణికులకు తాగునీటి ఇబ్బందులు తొలగించేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటుచేసినట్లు మున్సిపల్ కమిషనర్ నూరల్ నజీబ్ పేర్కొన్నారు. లిక్కిన వీస్ గౌడ్, కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, అబ్బుబాకర్ సిద్దికి, లాలూనాయక్, లిక్కి విజయ్‌గౌడ్, మశ్చందర్, నర్సింహులు, సంజీవరెడ్డి ఉన్నారు.